క్లుప్తంగా

సుబ్బారెడ్డిని పరామర్శించిన ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతదేహానికి ఆ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఆసిఫ్ మంగళవారం నివాళులర్పించారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న ఆసిఫ్ ఇతర పార్టీ నేతలతో కలిసి మంగళవారం ఒంగోలుకు వెళ్లారు. ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బారెడ్డిని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కల్యాణ్, శివరామ్, కల్కి, నరేంద్ర సింగ్, నయీమ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై విఘ్నాధిపతి గణపతికి మంగళవారం విశేష అభిషేకాలు, హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాల్లో ఆలయ అర్చకులు గణపతి ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చన నిర్వహించారు. అనంతరం యాగశాల్లో నిర్వహించిన గణపతి హోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. సంకట హర చతుర్థిన స్వామిని పూజించడం వల్ల జాతకంలో ఉన్న సమస్యలు తొలగిపోవడంతో పాటు చేపట్టిన పనుల్లో విఘ్నాలు తొలగిపోతాయని అర్చకులు పేర్కొన్నారు. హోమాలను జరిపించుకున్న ఉభయదాతలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఉండ్రాళ్లను ప్రసాదంగా అందజేశారు.

మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నిబంధనలు అతిక్రమించి మద్యం తాగడమే కాకుండా, వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన మందుబాబులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు నగర పోలీసు కమిషనర్ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో వివరాలు తెలియజేశారు. నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం తాగి వాహనాలు నడిపిన 42 మందిని గుర్తించి వారిని ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ మెట్రోపాలిటన్ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 15 మందికి ఒక్కొక్కరికి రూ.15వేలు, 27మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేస్తామని, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు సూచించారు.

నదిలో మునిగి బాలుడు మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటలాడుకునేందుకు స్నేహితుడుతో కలిసి భవానిఘాట్‌కు వెళ్లిన ఐదేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు నదిలో మునిగి చనిపోయిన ఘటన భవానిపురం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం పెద్ద డిల్లగొళ్ల గ్రామానికి చెందిన కోడిగె వెంకట పవన్‌కుమార్(11) భవానిపురంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి ఓ ప్రైవేటు పాఠశాల్లో చదువుకుంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం భోజనం చేసి స్నేహితుడు కార్తీక్‌తో కలిసి ఆటలాడుకునేందుకు భవానిఘాట్ వద్దకు వెళ్లాడు. స్నానం చేసేందుకు నదిలో దిగి ఇద్దరూ ప్రమాదవశాత్తు మునిగిపోయారు. నీటిలో కనిపించకుండా పోయారు. సమీపంలోని వారు కార్తీక్‌ను రక్షించారు. వెంకట పవన్‌కుమార్ కనిపించకుండా పోయాడు. తెలిసిన వారు బాలుడు అమ్మమ్మకు జరిగిన విషయం చెప్పారు. వెంటనే ఆమె నది వద్దకు చేరుకుంది. పోలీసులు బాలుడి కోసం గాలించగా.. కొంత సమయానికి బోటుకు కొంత దూరంలో నీటిపై తేలి చనిపోయి కనిపించాడు. బాలుడు అమ్మమ్మ ఆదిలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేశారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లో అసంపూర్తి పనులతో వాహనచోదకులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్ది నెలల క్రితం సన్‌లైట్ సెంటరులో రూ.24 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు జరిగాయి. కల్వర్టుకు శ్లాబ్ వేసి వదిలేశారు. రెండు వైపులా రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. డ్రెయినేజీ పనులు చేయాల్సి ఉంది. పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు నరకం చూస్తున్నారు. ఏపీఐఐసీ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా అధికారులు స్పందించి కల్వర్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

తాగునీటి కష్టాలు

అరకొరగా నీటి సరఫరా



కుళాయిలో వస్తున్న కలుషిత నీరు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వేసవి తీవ్రత ప్రారంభం కాకముందే కేదారేశ్వరపేట, పూర్ణానందంపేట వాసులు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం తెల్లవారుజాము నుంచే కుళాయిల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం తెల్లవారుజామునే లేచి కుళాయిల వద్ద పడిగాపులు పడుతున్నా అరకొరగా వచ్చే నీటితో అంటే రెండు, మూడు బిందెలతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని ఆయా ప్రాంతాల మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుళాయిల్లో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా నీరు సరఫరా చేసే సమయాన్ని కూడా పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కుళాయి తెరిస్తే రంగుమారిన నీళ్లు

తాగునీటి కోసం కుళాయిలు తెరిస్తే రంగు మారిన నీళ్లు, పురుగులు దుర్గంధంతో వస్తున్నాయని, కాసేపు ఆగి పట్టుకుందమన్నా నీళ్లు అరగంటకూడా రాకుండా ఆగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పన్నులు చెల్లిస్తున్నా అందని తాగునీరు

ప్రతి ఏటా ఇంటిపన్ను, నీటి పన్ను చెల్లిస్తున్నా తాగేందుకు మంచినీరు దొరకని పరిస్థితి తమదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు చెల్లింపు కొంత అలస్యం అయితే కుళాయి కనెక్షన్‌లు కట్ చేసే అధికారులు తాగునీటి సరఫరా సక్రమంగా లేక పోయినప్పుడు ఎందుకు పట్టించుకోరు అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నదికి కూత వేటు దూరంతో ఉన్న తమకే ఇటువంటి పరిస్థితి ఉంటే మిగిలిన వారి పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

రంగుమారిన నీళ్లు వస్తున్నాయి



ఉదయం తాగునీటి కోసం కుళాయి తెరిస్తే రంగు మారిన నీళ్లు, నలకలు, పురుగులు, దుర్గంధంతో నీళ్లు వస్తున్నాయి. వాటిని ఏలా తాగాలో అర్థం కావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– లక్ష్మమ్మ, కేదారేశ్వరపేట

అర్థగంటకు మించి రావు



తెల్లవారు జామునే లేచి తాగునీటి కోసం పడిగాపులు పడినా అర్ధగంటకు మించి నీరు రావడం లేదు. ఒక వేళ నీరు వచ్చినా మొదటి 15 నిముషాల వరకు మురికినీరే వస్తోంది. తర్వాత వచ్చే నీరు వంటలకు, ఇంట్లో వాడుకునేందుకు సరిపోవటం లేదు.

– సుజాత, కేదారేశ్వరపేట

నేత్రపర్వంగా సాగిన శ్రీకృష్ణలీలలు పద్యనాటక ప్రదర్శన



శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శిస్తున్న సురభి కళాకారులు

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో సురభి నాటకోత్సవాలలో భాగంగా మంగళవారం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ప్రదర్శించిన శ్రీకృష్ణలీలలు పద్యనాటకం హృద్యంగా సాగింది. పోతన భాగవతం ఆధారంగా రచించిన ఈ నాటకంలో శ్రీకృష్ణుని జననం, పూతన, శకటాసుర సంహారం, కాళీయ మర్దనం, గోవర్ధనగిరిని ఎత్తడం, గోవులను రక్షించడం, కంస సంహారం తదితర అంశాలతో నాటకం సాగింది. నిర్వహణ సురభి డ్రామా థియేటర్, బాలాజీ సురభి థియేటర్స్, పర్యవేక్షకులు సురభి ఎం.నాగరాజు, సురభి జయానంద్

సురభి కళాకారులు ధన్యజీవులు

సురభి కళాకారులు ధన్యజీవులని విశ్రాంత పోలీస్ అధికారి ఎం.సత్యనారాయణ అన్నారు. మంగళవారం నాటి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పద్య నాటకానికి జీవితాలను అంకితం చేసిన సురభి కళాకారులను గుర్తించి, వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. నర్తనం పత్రిక చీఫ్ ఎడిటర్ మాధవి పురాణం, దూరదర్శన్ వ్యాఖ్యాత అన్నపూర్ణ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని స్టాగ్ ఇన్నోవేషన్ సీటీఓ డాక్టర్ వీవీ సురేష్‌బాబు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఆవిష్కరణ – ప్రజ్వలనం' అంశంపై 10 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ రంగాలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలన్నారు. డిజైన్ థింకింగ్ మెథడాలజీపై పట్టు పెంచుకోవాలన్నారు. అదేవిధంగా వినియోగదారుల అవసరాలకు సృజనాత్మక ఆలోచనలు జోడించి ఉత్తమ పరిష్కారాలను గుర్తించడం వంటి వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో నిర్వహించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డప్పు కళాకారుల పెన్షన్ తొలగించేందుకు కుట్ర



విజయవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న డప్పు కళాకారులు, కేవీపీఎస్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం సర్వే పేరుతో డప్పు కళాకారుల పెన్షన్ తొలగించేందుకు కుట్ర చేస్తోందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి అన్నారు. మంగళవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు కేవీపీఎస్, డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో డప్పు కళాకారుల పెన్షన్ల తొలగింపు నిలిపివేయాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలనే డిమాండ్లతో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు తరతరాలుగా డప్పు కళను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్వే పేరుతో పెన్షన్లు తొలగించే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. డప్పు కళాకారుల పెన్షన్ యథావిధిగా కొనసాగించాలని, అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు రూ.7వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్ వయస్సు తగ్గించాలని, కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా చౌక్ నుంచి లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ ఐక్యత భవన్‌కు భోజనం చేసేందుకు వెళుతున్న డప్పు కళాకారులు, కేవీపీఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెమెడ క్రాంతి కుమార్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు జె.వెంకటేష్‌లపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. బలవంతంగా వారిని పోలీసు వాహనాల్లో ఎక్కించి అజిత్‌సింగ్ నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న డప్పు కళాకారులు, కేవీపీఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఖండించారు.

రణదీవెనగర్‌లో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 21వ డివిజన్‌లోని రణదీవెనగర్‌లో వెంటనే అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. డివిజన్‌లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డివిజన్‌లోని 106, 108 సచివాలయాల వద్ద స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజా సమస్యల అధ్యయనం కోసం వారం రోజుల పాటు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించామన్నారు. ఈ యాత్రలో స్థానిక ప్రజలు అనేక సమస్యలను యాత్ర బృందం దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. రణదీవెనగర్ మినహా మిగతా అన్ని ప్రాంతాల్లో మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, నీరు రంగు మారి దుర్వాసన వస్తోందని, కలుషిత మంచినీటితో ప్రజలు రోగాలపాలవుతున్నారని వివరించారు. కృష్ణానదికి కూత వేటు దూరంలో ఉన్నా స్వచ్ఛమైన తాగునీటిని కార్పొరేషన్ అందించలేకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని పేర్కొన్నారు. రిటైనింగ్ వాల్ పూర్తయినా అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం ఇప్పటికీ చేపట్టలేదన్నారు. మురుగు నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయని వివరించారు. అనేక సార్లు కార్పొరేషన్ అధికారులకు, ప్రభుత్వానికి ఈ సమస్యపై నివేదించినా, వినతులు తెలిపినా ఫలితం లేదని ఆరోపించారు. సీపీఎం నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ.. సమస్యల వలయంలో కృష్ణలంక ఉందన్నారు. ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు మంజూరు చేయాలని, రూఫ్ కన్వర్షన్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానికులతో కలిసి 106,108 సచివాలయాల అడ్మిన్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోరాడ రమణ, అప్పలనాయుడు, లక్ష్మి, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జంక్, ఫాస్ట్ ఫుడ్స్‌కు యువత దూరంగా ఉంటూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను నిత్యం తీసుకోవడం వల్ల చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ సూచించారు. సిద్ధార్థ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మంగళవారం పోషకాహార పదార్థాల ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనను రమేష్ ప్రారంభించి మాట్లాడారు. పోషకాహారంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. పోషక విలువలు ఉన్న రాగి ఇడ్లీ, మిల్లెట్ అట్టు ఇలా చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తినాలని సూచించారు. కళాశాల డైరెక్టర్, జంతుశాస్త్ర విభాగాధిపతి వేమూరి బాబురావు మాట్లాడుతూ.. సమతుల ఆహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, కళాశాల ఇంటర్నల్ క్వాలిటీ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పువ్వాడ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఎ.సాంబానాయక్, డాక్టర్ కె.రత్నకుమారి, పి.లలితాప్రియాంక, సీహెచ్.శిరీష, డి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ ఆహార పదార్థాలు ప్రదర్శించి వాటిని తయారు చేసిన విధానం, వాటిని తినడం వల్ల శరీరానికి లభించే పోషకాల గురించి విద్యార్థులు వివరించారు.

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

పటమట(విజయవాడతూర్పు): అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వీఎంసీ అగ్నిమాపక నిరోధక అధికారులు సూచించారు. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో బందరురోడ్డులోని శేషసాయి కల్యాణ మండపం, మొగల్రాజపురంలోని శ్రీనివాస గ్రావిటీ కాలేజ్, తనూజా ఇమేజ్ డయాగ్నోస్టిక్ సెంటర్, పలు సినిమా థియేటర్ కాంప్లెక్స్‌లను వారు మంగళవారం పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి మాల్యాద్రి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానంపై ఆయా సంస్థల సిబ్బందికి మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎలాంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, స్మోక్ అలారం ఎలా పనిచేస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ చర్యలు ఏమి చేపట్టాలి వంటి విషయాలపై అవగాహన కల్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీలో ఉద్యోగోన్నతులు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో క్లాస్–4గా విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పిస్తు మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంబేడ్కర్ స్మృతివనం క్యాష్‌కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గార్డెనర్ ఎం.విజయలక్ష్మికి ప్రమోషన్ ఇచ్చి, సెక్రటరీ సెల్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. మొగల్రాజపురం ఆయుర్వేద డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎన్‌టీ వర్కర్ డి.బుజ్జికి ఉద్యోగోన్నతి కల్పించి ఎస్టేట్స్ సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న జీజీఎంఎస్ ప్రశాంతిని ఆడిట్ సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. కండ్రికలోని బి.వి.సుబ్బారెడ్డి వీఎంసీ స్కూల్లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.రామకృష్ణను సర్కిల్–1 పట్టణ ప్రణాళిక విభాగానికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీచేశారు. వీఎంసీ ఎస్టాబ్లిష్ సెక్షన్‌లో విధులు నిర్వహించే ప్రజారోగ్య విభాగం పీహెచ్ వర్కర్ ఎ.వెంకటేశ్వరమ్మకు జూనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించి అక్కడే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజారోగ్య విభాగంలో శానిటరీ మేస్త్రీగా విధులు నిర్వహించే జి.పద్మశ్రీని అదే సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

టీచర్స్‌కాలనీ పార్క్ శుభ్రం చేశారు

సాక్షి ఎఫెక్ట్



పార్క్ లోపల శుభ్రం చేస్తున్న సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ఉద్యానవన శాఖ అధికారుల నిర్లక్ష్యానికి గురై ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న భవానీపురం టీచర్స్ కాలనీ శివాలయం రోడ్‌లోని రెండు పార్క్‌లలో ఒక పార్క్‌లో ఎట్టకేలకు మంగళవారం చెత్తను తొలగించి శుభ్రం చేశారు. సంబంధిత అధికారులు పట్టించుకోని కారణంగా స్థానికులకు అందుబాటులో ఉండాల్సిన రెండు పార్క్‌లు అధ్వాన పరిస్థితుల్లో ఉన్న నేపథ్యంలో మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉద్యానవన శాఖ అధికారులు సిబ్బందితో ఒక పార్క్‌లో మాత్రమే శుభ్రం చేయించారు. అయితే ఈ పార్క్‌లో బోరు, మోటారు రెండూ పాడైపోయి ఉన్నాయి. వాటిని కొత్తగా వేయిస్తే తప్ప గ్రీనరీ పెంపుదలకుగానీ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే దానిపై చల్లటానికిగానీ నీళ్లు ఉండవు. రెండు పార్క్‌ల్లో స్థానికులు కోరుతున్న విధంగా ఏయేపార్క్‌ల్లో ఓపెన్ జిమ్, పిల్లల ఆటపరికరాలు, వాకింగ్ ట్రాక్, ఏర్పాటు చేస్తారో తెలియ లేదు. వివరణ కోసం పార్క్‌ల అధికారికి ఫోన్ చేయగా ఆయన స్పందించ లేదు. రెండో పార్క్ ఎప్పుడు శుభ్రం చేస్తారో వేచి చూడాలి.

సంప్రదాయ చేతి వృత్తుల అభివృద్ధికి కృషి

వైఎస్సార్ సీపీ ఆర్టిజన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్



తోలేటి శ్రీకాంత్‌ను సత్కరించిన సంఘ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రాచీన సంప్రదాయ చేతి వృత్తుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ఆర్టిజన్ సెల్ (చేతి వృత్తుల విభాగం) రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ పేర్కొన్నారు. శ్రీకనకదుర్గ విజయవాడ నాయీబ్రాహ్మణ క్షవర వృత్తిదారుల సంఘం గౌరవాధ్యక్షుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మల్కాపురం కనకారావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు మంగళవారం విజయవాడలోని తోలేటి శ్రీకాంత్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నాయీబ్రాహ్మణ క్షవర వృత్తిదారుల సెలూన్ల నిర్వహణకు ప్రతి ఏడాదీ 'జగనన్న చేదోడు' పథకం ద్వారా రూ.10వేలు అందించి వారికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకాన్ని అమలు పరచక పోవడం బాధాకరమన్నారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలకు చేదోడు వాదోడుగా నిలిచి సంక్షేమ సారధిగా నిలిచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శ్రీకనకదుర్గ విజయవాడ నాయీబ్రాహ్మణ క్షవర వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి ద్రాక్షారపు రాము మాట్లాడుతూ క్షవర వృత్తిదారుల సమస్యలపై త్వరలో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. పరిష్కారం లభించేవరకు పోరాడుతూనే ఉంటామని తెలిపారు. తొలుత తోలేటి శ్రీకాంత్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు రాయవరపు గణపతిరావు, సభ్యులు యలమంచిలి రాజశేఖర్, గోల్కొండ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాటు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి నేతలు


సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి నేతలు ప్రకటించారు. సత్యనారాయణపురంలోని సీతారాముల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గుడివాడ వేణుగోపాల్ మాట్లాడుతూ 2025 మార్చి 17 నుంచి 2026 మార్చి 16 వరకు పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం పట్ల సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు కూనల యుగంధర్, గౌరవ అధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి బొగ్గరపు వెంకట సత్యనారాయణ, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనధికార పరిమిట్ రూమ్‌కు తాళాలు..!

ఇదంతా మామూలే అంటున్న సిండకేట్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అంబాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని లచన్ వైన్స్ అనధికార పరిమిట్ రూమ్‌కు కొత్తపేట పోలీసులు మంగళవారం తాళాలు వేయించారు. మద్యం మత్తులో యువకులు కర్రలు, కత్తులతో వీరంగం సృష్టించిన ఘటనపై మంగళవారం మీడియాలో కథనాలు వెల్లడయ్యాయి. తొలుత ఘటనపై స్థానికులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వగా, కొత్తపేట పోలీసులు వైన్స్ షాపు వద్దకు చేరుకున్నారు. అయితే వైన్స్ షాపు వద్ద ఎటువంటి గొడవ జరగలేదని కొత్తపేట పోలీసులను తప్పుదారి పట్టించారు. చివరకు మీడియాకు ద్వారా జరిగిన వీరంగం పోలీసు ఉన్నతాధికారులకు తెలియడంతో వైన్స్ షాపు నిర్వాహకులు ఒక్కసారిగా కంగుతిన్నారు. వైన్స్ షాపు ఎదుట ఉన్న సీసీ కెమెరాలు ఉన్నా వాటిలో రికార్డు అయిన పుటేజీతో అంతా తెలుస్తుంది కదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొత్తపేట పోలీసులు మంగళవారం వైన్స్‌షాపు వద్దకు చేరుకుని అనధికార పరిమిట్ రూమ్‌కు తాళాలు వేయించారు. మద్యం సిండికేట్‌కు చెందిన ఈ వైన్స్ షాపు వెనుక భారీ స్థాయిలో షెడ్డు ఏర్పాటు చేయడంపై తొలి నాళ్ల నుంచే స్థానికుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రెండు వందల గజాలలో ఉన్న ఈ అనధికార పరిమిట్ రూమ్‌లోనే కాకుండా వైన్స్ షాపునకు ఆనుకుని ఉన్న వీధిలోనూ ఉదయం నుంచి రాత్రి వరకు ఆరు బయట మద్యం తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పోలీసులకు గతంలోనే ఫిర్యాదులందాయి. అయితే అనధికార పరిమిట్ రూమ్‌కు తాళాలు వేయడంతో ఇదంతా మామూలే సార్.. మీరు లైట్ తీసుకోండని నిర్వాహకులు చెబుతున్నట్లు సమాచారం.

డ్రెయిన్ నిర్మాణ పనుల్లో జాప్యం



సిమెంట్ కాంక్రీట్‌తో కట్టిన గోడకు రోడ్‌కు మధ్యలో మట్టితో పూడ్చాల్సిన ప్రదేశాన్ని వదిలేసిన వైనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజాప్రయోజనం కోసం నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధిత అధికారుల సహకారం ఉంటే త్వరితగతిన పూర్తవుతాయి. తద్వారా ప్రజలు కూడా ఆనందపడతారు. భవానీపురం స్వాతి సెంటర్‌లో జరుగుతున్న సైడు డ్రెయిన్ నిర్మాణ పనులకు ఇంజినీరింగ్ అధికారి అలసత్వం కారణంగా జాప్యం జరుగుతోంది. భవానీపురం దర్గా వద్ద ఉన్న డ్రెయిన్‌లో మురుగునీరు కదలని నేపథ్యంలో స్వాతి సెంటర్‌లో ఇటీవల డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డ్రెయిన్ నిర్మాణం పనుల్లో భాగంగా ఒక వైపు సిమెంట్ కాంక్రీట్‌తో గోడ కట్టారు. దానికి ఆవల తొలుత కోసం తీసిన గోయ్యిలో ఒక వైపు (జాతీయ రహదారి సర్వీస్ రోడ్) మట్టితో పూడ్చాల్సి ఉంది. ఆ విషయం వర్క్ ఆర్డర్‌లో లేకపోవడంతో ఏం చెయ్యాల్లో అర్థంకాక ఏజెన్సీ బాధ్యులు తల పట్టుకుంటున్నారు. అదేవిధంగా డ్రెయిన్ నిర్మించే సమయంలో వాటర్ సప్‌లై పైప్‌కు తాత్కాలికంగా డమ్మీ వేయాల్సి ఉండగా అధికారులు అది కూడా చేయకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. దాంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయిన్ నిర్మించే ప్రక్రియలో వారు అందించాల్సిన సహకారం అందిస్తే సాధ్యమైనంత త్వరలో పూర్తవుతుందని, తద్వారా ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు కోరుతున్నారు.